"మాచింగ్ జాకెట్ బట్టలు కనిపించాయి. అందుకని వాటికోసం వెళ్ళాను." అందామె బట్టల పాకెట్ బాగ్‌లో పెడుతూ.

రిక్షాలో వెడుతున్నప్పుడు "చీపురుకట్ట" అందామె.

"పనిమనిషితో తెప్పించుకో."

"డబ్బులు ఎక్కువ తీసుకుని సరయిన చీపురుకట్ట తీసుకురాదు" సణుగుతూనే ఉంది ఆమె.

అతను వినిపించుకోలేదు.

రిక్షాదిగి ఇంట్లో ప్రవేశించగానే అన్నాడతను

"నన్నెప్పుడూ నీతో 'షాపింగ్'కి రమ్మని అడక్కు."

"మీతో నేనసలు రాను బాబూ. మీకు అన్నిటికీ తొందర, హడావిడి. ప్రక్కింటావిడతో కలిసి వెళ్ళి నాకు కావలసినవి నెమ్మదిగా స్థిమితంగా, తెచ్చుకుంటాను" అందామె. అతను తెల్లబోయాడు.

—సి. భారతి

# రా. కీ. నా.

పట్టు (ఇంకా) వదలని విస్కీమార్కుడు తాలూకా ఆఫీస్‌కు తిరిగివెళ్ళి ధరావతు కట్టి నామినేషన్ దాఖలు చేసి, ఓటర్ల కేసి నినాదభరితంగా సాగిపోతున్నాడు అనుచరులతో సహా. అప్పుడు ఆ బాలెట్‌లో బేతాళుడు యిలా విన్పించసాగాడు.

"ఒ రా. కీ. నా.... నువ్వే నోట్లు చల్లితే ఓట్లు పండుతాయనీ, రకరకాల వాగ్దానాలతో ఓట్లు దండిగా దండుకోవచ్చుననీ భ్రమపడకు. ఒకోసారి పైసా కూడా ఖర్చు చేయని అభ్యర్థులు తమ బుద్ధిబలంతో గెలవటం కూడా జరుగుతుంది. అందుకు నిదర్శనంగా నీకు ఓటు బాబు, ఓటునాధన్‌ల కథ చెబుతాను శ్రద్ధగా విను." అంటూ ఇలా విన్పించసాగాడు: ఆ రా. కీ. నా. (రాజకీయ నాయకుడు) బుద్ధిగా వినసాగాడు.

"పూర్వం యిలాగే 'ఎన్నికలనాడు' అనే రాష్ట్రంలో మధ్యంతర ఎన్నిక లొచ్చాయి. అప్పుడు 'ఓటువారిపాలెం' అనే నియోజకవర్గంలో యిద్దరే అభ్యర్థులు నిలబడ్డారు.

"ఆశ్చర్యంగా వుందా? అరడుగుల చీరలాగా, హనుమంతుడి తోకలాగా సాగిపోయే బాలట్ పాపర్ హఠాత్తుగా యిలా (కు)చించుకుపోవటానికి కారణం.... మరెవరూ పోటీచేయకపోవటం కాదు. ఓటుబాబు అనే అభ్యర్థి డబ్బిచ్చి మిగిలిన నామినేషన్‌లన్నీ ఉపసంహరింపచేస్తూ వచ్చాడు. కాని, ఈ ఓటు నాథన్ మటుకు లక్ష రూపాయలిచ్చినాసరే, తాను విరమించుకునేది లేదని ఖరాఖండిగా చెప్పేశాడు...."

"ఈ ఓటునాథన్‌కు అంతపలుకుబడి, తన మెజారిటీమీద నమ్మకం వున్నాయా?" అబ్బురపడ్డాడు రాజకీయ నాయకుడు.

"అబ్బే! పోయిన మూడుసార్లు ధరావతు కోల్పోయి మళ్ళీ నాల్గోసారి ఆ నామినేషన్ వేశాడు, అంతరాత్మ ప్రబోధం ప్రకారం. (వీడికో అంతరాత్మ, దానికో ప్రబోధం కూడానూ అంటూ ఆశ్చర్యపోయాడు రా. కీ. నా.) అయినాసరే ఓటు బాబు మాత్రం తన ప్రయత్నాలు మానలేదు.

ఓటుబాబు ఇంటింటికీ పోయి ఆడవాళ్ళకి చీరలు, సారెలు, మగవాళ్ళకి ధోవతులు, ఉత్తరీయాలు పంచాడు. ఓటుకో నోటు చొప్పున ఊరంతా జల్లాడు. మీటింగ్‌లమీద మీటింగులెట్టి వాగ్దానాల వాన కురిపించాడు. నియోజకవర్గంలో లైట్లు పన్జేయని వీధులన్నిటిలోను దగ్గరుండి పని జరిపించి, ఎన్నికలయ్యేదాకా కరెంటు పోకుండా కట్టుదిట్టం చేశాడు. ధరలు పెరుగుదల తన విజయానికి గొడ్డలిపెట్టు కనుక వెంటనే ధరలు తగ్గటం కోసం ఊరి వ్యాపారులతో మంతనాలారంభించాడు.

ఇంతెందుకు ఒక్కమాటలో చెప్పాలంటే, ఆ నియోజకవర్గం మొత్తాన్ని భూతల



స్వర్గంగా మార్చాడు. ప్రతి వస్తువూ కూడా (అతి) సరసమైన ధరలకే లభించేలా చేశాడు. ఓటునాధన్ మటుకు ఇవేమీ పట్టనట్టు, నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకున్నాడు. ఈసారికి ఓట్లు "భయంకరంగా" పోలవుతాయనీ, తాను "గట్టి మెజారిటీ"తో గెలుస్తావనీ ఓటుబాబుకు "అంతరాత్మ ప్రబోధం" కూడా చేసింది.

ఓటర్లూ, కేండేట్లూ కూడా ఎప్పుడా, ఎప్పుడా అని ఎదురు చూసిన ఆ(పోలింగ్) రోజు రానే వచ్చింది. ఆశ్చర్యంగా, ఆ యేడు 80% ఓట్లు పోలయ్యి, ఆ నియోజకవర్గం చరిత్రలోనే చరిత్ర సృష్టించాయి."

"అయితే ఓటు బాబు గెల్చాడా? ఎంత మెజారిటీ వచ్చింది? అసలు ఓటునాథన్‌కు డిపాజిట్ దక్కిందా?" అంటూ ఉద్రేకంగా అడిగాడు రా. కీ. నా.

"లేదు. ఓటుబాబు ఓడిపోయాడు. ఇక్కడే నాకో సందేహం. ఇన్ని సౌకర్యాలు చేసిన ఓటుబాబు ఎందుకు ఓడిపోయాడు? అసలు ఏ మాత్రం డబ్బు ఖర్చుచేయని ఓటునాథన్ ఏ విధంగా గెల్చాడు? నా ప్రశ్నకు జవాబు తెల్సికూడా చెప్పకపోయావో నీ ఎన్నిక చెల్లకుండా పోతుంది. ఆనక కోర్టుల చుట్టూ తిరుగుతావు" అంటూ "బ్లాక్ మెయిల్" చేశాడు "బాలెట్‌లోని బేతాళుడు."

ఒక్కక్షణం తల పంకించి, టోపీ సరిచేసుకుని ఇలా మొదలెట్టాడు రా. కీ. నా.

"ఓటుబాబు ఈ ఏర్పాట్లన్నీ చేయటానికి కారణం ఈ ఎన్నికలేననేది ఆ నియోజకవర్గంలో వారందరికీ తెల్సు. ఇకపోతే ఓటునాథన్ చేసిందల్లా ఆ ఎన్నికలలో తాను పోటీచేయటంలో వుద్దేశ్యం ప్రజాసేవయే అనీ, అసలు తనకు గెలిచే ఆశే లేదనీ, కేవలం తను పోటీలో వుంటే ఎన్నికలయ్యేవరకైనా ప్రజలకు ఈ సౌకర్యాలు కగులుతాయనే సదుద్దేశంతో నుంచున్నట్లుగా దుమారం లేపి, సానుభూతి సంపాదించాడు. సమయానుకూలంగా ప్రచార పద్ధతి మార్చి ప్రజల్ని ఏమార్చి సానుభూతితో వాళ్ళు వేసే ఓట్లతో ఓ సీటు కొట్టేశాడు" అంటూ ముగించాడు తన ఉపన్యాసం.

ఈవిధంగా నిజంగా, నిజాన్ని వెలిగక్కటంతో రా. కీ. నా.కు రాజకీయ వ్రతభంగమైంది. రా. కీ. నా. కు రాజకీయ వ్రతభంగం కావటంతో బేలట్‌లో భేతాళుడు రివ్వున ఎగిరిపోయాడు ఎగస్ పార్టీకి.

భేతాళుడి మత్తు వదలగానే అతడి అనుచరులంతా విస్కీమార్కు(డు) డౌన్ డౌన్ అంటూ వినాదాలిస్తూ అవతలి పార్టీలో చేరిపోయారు.

—పి. శ్రీనివాస